జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ‖ సంపుటి:1 ‖ సంచిక: 88 ‖ ఆదివారం ‖ 23-8-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

23 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి ఏకాదశి తె. 4:18o వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మూల సా. 5:35 వరకు తరువాత పూర్వాషాఢ యోగం విష్కంభ ఉ. 6:13 వరకు కరణం వనిజ మ. 3:10 వరకు విష్టి తె. 4:18o వరకు వర్జ్యం మ. 3:56 నుండి సా. 5:44 వరకు దుర్ముహూర్తం సా. 4:53 నుండి సా. 5:43 వరకు రాహుకాలం సా. 4:59 నుండి సా. 6:33 వరకు యమగండం మ. 12:18 నుండి మ. 1:52 వరకు గుళికాకాలం మ. 3:25 నుండి సా. 4:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు ఉ. 10:38 నుండి మ. 12:25 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు



తెలంగాణ రైజింగ్ అధికారిక ప్రతినిధి బృందం లండన్ పర్యటనలో భాగంగా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యావేత్తల బృందంతో కీలక సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ఈ సందర్భంగా ప్రతినిధి బృందం వివరించింది. సమావేశంలో తెలంగాణలో ఉన్న విద్యా, సాంకేతిక, పరిశోధనా అవకాశాలను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులకు వివరించారు.

## కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ విద్యా భాగస్వామ్యం

### కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

### విద్య, పరిశోధన రంగాల్లో సహకారానికి అంగీకారం

### స్టార్టప్‌లు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలకు ప్రోత్సాహం

లండన్, ఆగస్టు 22: ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించి అంతర్జాతీయ స్థాయి విద్యా వాతావరణం ఏర్పాటులో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. ప్రపంచ పెట్టుబడులు, విద్యా భాగస్వామ్యాలు, పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల వాతావరణాన్ని కూడా వివరించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన మార్కెటింగ్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, ఫ్రూగల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహ-చైర్మన్ ప్రొఫెసర్ వెంకటేశ్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, అంతర్జాతీయ ప్రమాణాల కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం, విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. విద్యా రంగంతో పాటు పరిశోధన రంగంలోనూ పరస్పర (మిగతా 2వ పేజీలో)

## తెలంగాణ-లివర్‌పూల్ వ్యూహాత్మక భాగస్వామ్యం

లండన్‌లో ముఖ్యమంత్రితో కీలక భేటీ


జీవశాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టి

క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో సహకారం

అక్టోబరులో హైదరాబాద్‌కు ప్రతినిధి బృందం



లండన్, ఆగస్టు 22 : తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకునేందుకు బ్రిటన్‌లోని లివర్‌పూల్ నగరం ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు లివర్‌పూల్ నగర అభివృద్ధి విభాగ కార్పొరేట్ డైరెక్టర్లు సుసాన్ ఫిన్నెగన్, నువాలా గల్లాఘర్ తమ సహచరులతో కలిసి లండన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సమావేశంలో రెండు ప్రాంతాల మధ్య భవిష్యత్ సహకార అవకాశాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. సమావేశంలో జీవశాస్త్ర పరిశ్రమలు, సాంకేతిక రంగం, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వంటి కీలక తరువాయి 2 వ పేజీలో...



# ఏపీలో 10,060 ఉద్యోగాల భర్తీ

### నిరుద్యోగులకు భారీ శుభవార్త

### వార్షిక జాబ్ క్యాలెండర్ విడుదల

### నాలుగు దశల్లో నియామక ప్రక్రియ

### సెప్టెంబర్, అక్టోబర్‌లో నోటిఫికేషన్లు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. మొత్తం 10,060 ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన వార్షిక జాబ్ క్యాలెండర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఆర్థిక శాఖ నుంచి అవసరమైన అనుమతులు లభించడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను దశలవారీగా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం నిరుద్యోగుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది.

అమరావతి, ఆగస్టు 22 : ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను ఒకేసారి కాకుండా ప్రణాళికాబద్ధంగా నాలుగు దశల్లో భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉద్యోగార్థులు ముందస్తుగా సిద్ధం కావడానికి వీలుగా నోటిఫికేషన్ల విడుదల తేదీలను కూడా ప్రకటించారు. ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ పరిధిలో 1,500 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వం తెలిపింది. మిగిలిన పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియను వచ్చే రెండు నెలల్లో వేగవంతం చేయనున్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం సెప్టెంబర్ 15న 3,231 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. అనంతరం అక్టోబర్ 15న రెండు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా మరో 5,306 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఒక నోటిఫికేషన్ ద్వారా 2,311 పోస్టులు, మరో నోటిఫికేషన్ ద్వారా 2,995 పోస్టులను భర్తీ చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడినట్లవుతుంది. ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్ ఉద్యోగార్థులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందిస్తోంది. గతంలో ఉద్యోగాల తరువాయి 2 వ పేజీలో...



# పెద్ద తండా రహదారికి పొన్నం శంకుస్థాపన

## రూ.2.05 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం

### అభివృద్ధి పనులపై పొన్నం సమీక్ష.. గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు

సిద్దిపేట, ఆగస్టు 22 :

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం పెద్ద తండా అభివృద్ధికి కీలకమైన రహదారి పనులకు రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. రూ.2.05 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పెద్ద తండా-అవ్వకుంట బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో పూర్తిచేసిన అంతర్గత సీసీ రోడ్లను కూడా మంత్రి ప్రారంభించారు. రవాణా సౌకర్యాల మెరుగుదలతో గ్రామ ప్రజలకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న -పల్లెపల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజల సమస్యలను మంత్రి నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష (మిగతా 2వ పేజీలో)

# ప్రెస్ క్లబ్స్ సమాఖ్యను ప్రారంభించిన భట్టి

## హైదరాబాద్‌లో జాతీయ స్థాయి వేదిక ఆవిష్కరణ

### పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి కీలకం

### విశ్వసనీయతే జర్నలిస్టు ప్రధాన ఆస్తి

### జర్నలిస్టుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, ఆగస్టు 22 :

దేశంలోని పలు రాష్ట్రాల ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులతో ఏర్పాటైన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు భాగస్వామ్యంగా ఏర్పడిన ఈ వేదిక జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని పేర్కొన్నారు. పాలకులను ప్రశ్నించే హక్కు మీడియాకు ఉండాలని, విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు కూడా అవసరమని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే మీడియా వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం మరింత పటిష్టంగా నిలుస్తుందని వివరించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజా చైతన్యంలో జర్నలిజం కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తుచేశారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, లోకమాన్య (మిగతా 2వ పేజీలో)




# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఖమ్మంలో బీఎల్‌ఏల ఆత్మీయ సమ్మేళనం

### కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

### కేసీఆర్ ఆశయాల సాధనకు పిలుపు

### రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలారని విమర్శ

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్




ఖమ్మం, ఆగస్టు 22 : ఖమ్మం నియోజకవర్గంలో నిర్వహించిన బీఎల్‌ఏల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం రాజకీయ ఉత్సాహం నడుమ జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పార్టీ నేతలు కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ, నాగరాజ్ తదితరులతో కలిసి పలువురు నాయకులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్న బూత్ స్థాయి ఏజెంట్ల సేవలను గుర్తిస్తూ వారిని ఘనంగా సన్మానించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలను అభినందిస్తూ నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం:** కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత నిరుత్సాహపరుస్తుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. ధన పరంగా చేసే ప్రయత్నాలు కలసిరావు. వ్యాపారాలలో శ్రమ పెరుగుతుంది ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. ఇతరులతో అకారణ విభేదాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**వృషభం:** ప్రయాణాలలో ఆర్థిక లాభాలు కలుగుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహంతో ఉన్నత హోదాలు పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

**మిధునం:** వృత్తి వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధు మిత్రుల రాకతో గృహమున సందడి వాతావరణం నెలకొంటుంది. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగమున పని ఒత్తిడి ఉన్నప్పటికీ సకాలంలో పనులు పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చాలా కాలంగా వేధిస్తున్న సమస్యల నుండి తెలివిగా బయట పడతారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. కుటుంబమున శుభకార్య ప్రస్తావన వస్తుంది. వృత్తి ఉద్యోగ విషయంలో అధికారుల సహాయం లభిస్తుంది.

**సింహం:** వృత్తి వ్యాపారాలలో అధిక కష్టంతో స్వల్ప ఫలితాన్ని పొందుతారు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు నిర్వహించడం కష్టం అవుతుంది. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. సంతాన పరంగా ఊహించని సమస్యలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి అధికమవుతుంది.

**కన్య:** ఆర్థిక పరంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ సౌకర్యాలకు లోటు ఉండదు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నూతన వాహన లాభం కలుగుతుంది. మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సఫలమౌతాయి. స్థిరాస్తి సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి.

**తుల:** ముఖ్యమైన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు తొలగుతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్య విషయాలు చర్చిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

**వృశ్చికం:** ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. శ్రమాధిక్యతతో కానీ పనులు పూర్తికావు. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. భాగస్వామ్య వ్యాపారాలలో విభేదాలు కలుగుతాయి. వృత్తి, ఉద్యోగమున అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. కుటుంబ పెద్దల అనారోగ్య సమస్యలు భాదిస్తాయి.

**ధనస్సు:** చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో జాప్యం కలుగుతుంది. ఆకస్మిక ప్రయాణాల వలన శారీరక శ్రమ తప్పదు. జీవిత భాగస్వామితో పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆలయ దర్శనాలు చేసుకుంటారు.

**మకరం:** దూర ప్రాంత బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. విద్యార్థులు నూతన విద్యావకాశాలు పొందుతారు. వ్యాపారమున ఆటంకాలు తొలగుతాయి. వృత్తి,ఉద్యోగమున కష్టానికి తగిన గుర్తింపు పొందుతారు.

**కుంభం:** చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. ఇంటా బయట ఊహించిన సమస్యలు కలుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చోటు చేసుకుంటాయి. బంధుమిత్రులు మీ మాటతో విభేదిస్తారు. వ్యాపార వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి.

**మీనం:** ఆత్మీయుల నుండి కీలక విషయాలు సేకరిస్తారు. పాత మిత్రులతో విహారయాత్రలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.



## కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ విద్యా భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

సహకారాన్ని విస్తరించేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, అధ్యాపకులు మరియు విద్యార్థుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలపై చర్చలు జరిగాయి. ఈ భాగస్వామ్యం ద్వారా తెలంగాణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి పరిశోధన అవకాశాలను పొందే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. స్టార్టప్‌లు, వ్యవస్థాపకత అభివృద్ధి, ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటుపై కూడా సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించారు. యువ పారిశ్రామికవేత్తలకు ప్రపంచ స్థాయి మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం అందించే అవకాశాలను పరిశీలించారు. తెలంగాణలో పెరుగుతున్న ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంబ్రిడ్జ్ అనుభవాన్ని వినియోగించుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

## పెద్ద తండా రహదారికి పొన్నం శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.3.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రైతు భరోసా, రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నీటి సంరక్షణపై గ్రామ ప్రజల్లో అవగాహన పెరగాలని మంత్రి సూచించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారిస్తే మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని సూచించారు.

## తెలంగాణ-లివర్‌పూల్ వ్యూహాత్మక భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

రంగాల్లో పరస్పర భాగస్వామ్యంపై చర్చ జరిగింది. తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, సాంకేతిక వాతావరణం లివర్‌పూల్ ప్రతినిధులను ఆకట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. రెండు ప్రాంతాల మధ్య పెట్టుబడులు, నైపుణ్యాల మార్పిడి, సంయుక్త కార్యక్రమాల అమలుకు అవకాశాలను పరిశీలించారు. జీవశాస్త్ర రంగంలో పరిశోధనలు, వైద్య సాంకేతికత, ఔషధ తయారీ వంటి అంశాల్లో సహకారం పెంపొందించేందుకు పరస్పర ఆసక్తి వ్యక్తమైంది. అలాగే సమాచార సాంకేతిక రంగంలో ఆవిష్కరణలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై కూడా చర్చ సాగింది. క్రీడల రంగంలో ప్రతిభావంతులైన క్రీడాకారుల తయారీ, శిక్షణా కార్యక్రమాలు, అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో సినిమా, డిజిటల్ మీడియా, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి సంయుక్తంగా పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో విదేశీ నగరాలు, సంస్థలతో భాగస్వామ్యాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో లివర్‌పూల్‌తో ప్రతిపాదిత భాగస్వామ్యం రాష్ట్రానికి కొత్త అవకాశాలను తెరవగలదని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా పరిశ్రమలు, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఇది దోహదపడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేసేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబరులో హైదరాబాద్‌కు రానుంది. ఆ సందర్శన సందర్భంగా పరస్పర అవగాహన ఒప్పందాలు, సంయుక్త కార్యాచరణ ప్రణాళికలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. తెలంగాణ–లివర్‌పూల్ సహకారం రెండు ప్రాంతాల అభివృద్ధికి కొత్త దిశను చూపనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు బీఎల్‌ఏలు పార్టీకి వెన్నెముకలుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ సిద్ధాంతాలను గ్రామ గ్రామానికీ తీసుకెళ్లడంలో వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పార్టీ దృష్టికి తీసుకురావడంలో బీఎల్‌ఏలు ముందుండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడం, అంతర్గత విభేదాలు పెరిగిపోవడం వల్ల పాలన దెబ్బతింటోందని ఆరోపించారు. అధికార పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా పక్కన పడిపోయిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత లేకపోవడం, పరస్పర విభేదాలు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి బదులుగా కాంగ్రెస్ నాయకులు అంతర్గత రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత, వర్గ రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల తెలంగాణ నష్టపోతోందని అన్నారు. ఈ వైఫల్యాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ కేసీఆర్ చూపిన అభివృద్ధి దిశను ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణ, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం వంటి అంశాలపై పార్టీ కట్టుబాట్లను వివరించాలని సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండి పార్టీ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజల మద్దతు కూడగట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి తెలంగాణ ప్రజల సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీఎల్‌ఏల సేవలను కొనియాడుతూ, వారి కృషితో పార్టీ మరింత బలపడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌కు అడుగులు

**రేవంత్ బృందంతో కీలక రౌండ్‌టేబుల్ సమావేశం**

**ఉన్నత విద్యా అవకాశాలపై విస్తృత చర్చలు**

**తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి వ్యక్తం**

లండన్, ఆగస్టు 22 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని అధికారిక 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం లండన్ యూనివర్సిటీ సెనేట్ హౌస్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ ప్రతినిధులతో కీలక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. తెలంగాణలో ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను తీసుకురావడం, ఉన్నత విద్యా అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు కె. రామకృష్ణారావు, జయేశ్ రంజన్ పాల్గొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్ తరఫున లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌తో పాటు ఇతర విద్యా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్ స్థాపనకు సంబంధించిన అవకాశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. యూనివర్సిటీ అకాడమిక్ ఫెడరేషన్ పరిధిలోని వివిధ పాఠశాలలు, విభాగాల ద్వారా విస్తృత స్థాయిలో విద్యా కోర్సులు, శిక్షణ కార్యక్రమాలు అందించే అంశంపై ప్రతిపాదనలు పరిశీలించారు. ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం



కల్పిస్తున్న అవకాశాలు, మౌలిక వసతులు, పెట్టుబడి అనుకూల విధానాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతినిధి బృందం వివరించింది. అంతర్జాతీయ విద్యా సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్ ప్రతినిధుల బృందంలో కవితా రామ్‌దాస్, రూత్ కట్టుమురి, పాల్ మాడెన్, ప్రొఫెసర్ ఫన్మి ఒలోనిఫాకిన్, డాక్టర్ స్కై జెంగ్, కీత్ హారిసన్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుపై సానుకూల చర్చలు జరిగాయని, భవిష్యత్తులో విద్యా రంగంలో తెలంగాణ--యూనివర్సిటీ ఆఫ్ లండన్ భాగస్వామ్యానికి ఈ సమావేశం కీలక ముందడుగుగా నిలుస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## ప్రెస్ క్లబ్స్ సమాఖ్యను ప్రారంభించిన భట్టి

(మొదటి పేజీ తరువాయి)

తిలక్ వంటి మహనీయులు పత్రికలను సామాజిక, రాజకీయ మార్పులకు శక్తివంతమైన సాధనాలుగా వినియోగించారని తెలిపారు. సమాజ మార్పులో మీడియా పాత్ర ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. ప్రస్తుత కాలంలో సమాచార కొరత లేదని, కానీ విశ్వసనీయత కొరత ఉందని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధస్సు, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులకు విశ్వసనీయతే అత్యంత విలువైన ఆస్తిగా మారిందన్నారు. వాస్తవాలను నిర్ధారించి ప్రజలకు అందించడం మీడియా ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తూ సమాజానికి సేవ చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొనియాడారు. వారు ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాల పరిరక్షణకు ఈ సమాఖ్య ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జర్నలిస్టులు అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడంతో పాటు తమ వృత్తి ప్రమాణాలను కూడా కాపాడుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. తెలంగాణ గడ్డ స్వభావంలోనే స్వేచ్ఛగా మాట్లాడే, ప్రశ్నించే సంప్రదాయం ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' బలమైన వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు.

## ఏపీలో 10,060 ఉద్యోగాల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

భర్తీపై అనిశ్చితి నెలకొనగా, ఇప్పుడు ముందుగానే షెడ్యూల్ ప్రకటించడం ద్వారా అభ్యర్థులు తమ సన్నద్ధతను మరింత మెరుగుప రుచుకునే అవకాశం లభించింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత తమ ప్రణాళి కలను ఈ క్యాలెండర్‌కు అనుగుణంగా రూపొం దించుకోవాలని అధికారులు సూచిస్తు న్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. విద్య, పరిపాలన, సాంకేతిక, ఇతర శాఖల్లో ఖాళీల భర్తీ ద్వారా ప్రభుత్వ యంత్రాంగం మరింత బలోపేతం కానుంది. దీంతో ప్రజలకు అందించే సేవల నాణ్యత కూడా మెరుగుపడే అవకాశం ఉంది. ఉద్యోగాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూ స్తున్న నిరుద్యోగులకు ఈ జాబ్ క్యాలెండర్ కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. అక్టోబర్ మధ్య నాటికి మొత్తం నియామక ప్రక్రియ ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంతో అభ్యర్థులు తమ లక్ష్య సాధన కోసం మరింత కష్టపడాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## సంస్కరణలే బలం

న్యూఢిల్లీ, ఆగస్టు 22 : ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అభివృద్ధి, ఆశలకు ప్రతీకగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం--2026లో ప్రసంగించిన ఆయన, ప్రపంచం నేడు భారత్‌ను వృద్ధి, అవకాశాలు, స్థిరత్వానికి కేంద్రంగా చూస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన సంస్కరణలను అమలు చేస్తోందని చెప్పారు. విధాన పరమైన మార్పులతో పాటు పాలనా వ్యవస్థలో కూడా తదుపరి తరం సంస్కరణలను చేపడుతున్నామని ప్రధాని తెలిపారు. గతంలో ఉత్పత్తి పెంచిన సంస్థలను శిక్షించే విధానాలు ఉండేవని, ప్రస్తుతం ఉత్పత్తి పెంపునకు ప్రోత్సాహకాలు అందించే వ్యవస్థను అమలు చేస్తున్నామని వివరించారు. లైసెన్స్ రాజ్ కాలంలోని పరిమితుల నుంచి బయటపడి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే దిశగా దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని మోదీ చెప్పారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ వ్యవస్థలు, రక్షణ ఉత్పత్తి వంటి రంగాల్లో సాధించిన పురోగతి దేశ ఆర్థిక శక్తిని మరింత బలోపేతం చేసిందన్నారు. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక



పథకాలు దేశీయ తయారీ రంగానికి కొత్త ఊపునిచ్చాయని వివరించారు. దేశంలో రాజకీయ స్థిరత్వం, విధానాల కొనసాగింపే పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతున్న ప్రధాన అంశాలని ప్రధాని పేర్కొన్నా రు. స్థిరమైన ప్రభుత్వం, స్పష్టమైన విధానాలతో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోందని చెప్పారు. సురక్షితమైన, స్థిరమైన భారత్ ప్రపంచ స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. అంతర్జాతీయ సవాళ్ల మధ్య కూడా భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగిస్తోందని ప్రధాని తెలిపారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక వినియోగం ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యాన్ని సాధిస్తున్నామని చెప్పారు. దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా సంస్కరణల వేగం మరింత పెరుగుతుందని స్పష్టం చేశారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం ప్రపంచ వ్యాప్తంగా విధాన నిర్ణేతలు, పారిశ్రామిక వేత్తలు, ఆర్థిక నిపుణులు పాల్గొనే ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందింది. ఈ వేదికపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు భారత్ ఆర్థిక భవిష్యత్తు, పెట్టుబడుల అవకాశాలు, సంస్కరణ ల దిశపై అంతర్జాతీయ వర్గాల దృష్టిని ఆకర్షించాయి.

శ్వేత

సంపాదకీయం

ఆదివారం 23-8-2026

# రూపాయి బియ్యంతో దళారుల దందా

ఉచిత రూపాయికే కిలో బియ్యం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పక్కదారి పడుతోంది. బియ్యం స్మార్ట్ కార్డులు అందచేసినా, చాలావరకు బియ్యం అక్రమంగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టన్నుల కొద్ది బియ్యం పోర్టులు దాటిపోయాయి. తెలంగాణలో కూడా అదే విధంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలించి నయాదందా తెరతీసారు. ఎన్టీఆర్ హాయంలో పేదలకు బియ్యం అందించాలని కిలో రెండు రూపాయలకే పథకం తెచ్చారు. అది పలు రూపాంతరాలు చెంది. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉండగా కిలో రూపాయికే అందిస్తున్నారు. దీని ధరలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్నాయి. ఎక్కడ ఓటు బ్యాంక్ పోతుందో అన్న భయంలో పాలకులు ఉన్నారు. పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వాలు రూపాయి ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా బియ్యం ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లబ్ది అక్రమార్కుల పాలిట 'కాసుల పంట'గా మారుతోంది. రూపాయి లేకపోయినా పేదవాడు ఆకలితో అలమటించకూడదని ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుంటే, ఆ పథకం ఆశయం కాస్తా దారి మళ్లుతోంది. ఉచిత బియ్యం అర్హులైన పేదల కడుపు నింపాల్సింది పోయి, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతుండటం తీవ్ర విచారకరం. తినడానికి ఇచ్చే బియ్యం.. గడప దాటక ముందే విక్రయం జరుగుతోంది. వందలకోటల బిసినెస్ దీనివెనక నడుస్తోంది. ఈ రోజుల్లో చాలా చోట్ల రేషన్ కార్డు ఉండి, రేషన్ బియ్యాన్ని ఆహారంగా వాడుకోని వర్గాలు దాన్ని ఒక అదనపు ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నాయి. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే లబ్దిదారుల ఇళ్ల ముందే దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు, కేవలం ఐదు-పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల దందా ఇంకొంచెం ముందుకెళ్లింది. అసలు బియ్యం సంచులను ఇళ్లకు కూడా తీసుకెళ్లడం లేదు. షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి, బియ్యాన్ని అక్కడ వదిలేసి, కిలోకు రూ.10 నుండి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు.

ఈ విధంగా మిగిలిపోయిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంకొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా.. బహిరంగ మార్కెట్లో వీటిని కేజీకి రూ.20 నుండి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది. ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేసినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల అధికారులు హెచ్చరించడం షరామామూలుగా మారింది. దీంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపడం లేదు. దీంతో వ్యారం యధావిధిగా సాగుతోంది. చ్చరించారు. లబ్దిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగస్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న ఆహార ధాన్యాలను కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ రాబోయే 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖను నేరుగా ప్రజల చెంతకు చేర్చాలనే తపనతోనే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు తరలించే దుస్థితి ఉండేదని, దానిని మారుస్తూ దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది పేదలు లబ్ది పొందుతున్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందక ఇబ్బంది పడిన వారికి ఉపశమనం కలిగిస్తూ.. ప్రభుత్వం కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత అందుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కూడా ఈ కార్డులు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వాలు కఠిన చర్యలు తసీఉకోనంత వరకు ఈ దందా ఆగదు. అక్రమంగా తరలింపు కూడా ఆతదని పాలకులు గుర్తించాలి.

# సన్న వడ్లకు బోనస్‌లో కీలక మార్పులు

**ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాలకే బోనస్**



హైదరాబాద్,ఆగస్ట్22(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు 500 రూపాయల బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్దిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. అయితే కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి.

ఈ బోనస్ సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 7 రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి. అందులో ఆర్ఎస్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638 (కూనారం వరి-2), జైశ్రీరామ్, కేఎన్ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి) రకాలు ఉన్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10వ తేదీలోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికారులకు సొంత డిక్లరేషన్ రాసి ఇస్తే సరిపోతుందని తెలిపారు. సెప్టెంబర్ 10 లోపు ఈ పక్రియ పూర్తి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 2.51 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను మరింత సులభతరం చేయాలని రైతాంగం కోరుతోంది.

# 19 రోజులైనా ఆచూకీ లేని మత్స్యకారులు


**ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు**

విశాఖపట్టణం,ఆగస్ట్22(ఆర్ఎన్ఎ): కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు జెట్టీ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల బోటు గత 19 రోజులుగాకనిపించకుండా పోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నెల 3న వేటకు బయలుదేరిన ఈ బోటుతో 5వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో కమ్యూనికేషన్ తెగిపోయింది. సాధారణంగా వేటకు వెళ్లినవారు తిరిగొస్తారనే నమ్మకంతో కుటుంబసభ్యులు ఈ నెల 13వ తేదీ వరకు వేచి చూశారు. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆందోళనకు గురై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 17వ తేదీ నుంచి బాధితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ గాలింపు చర్యల్లో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న నాలుగు కోస్ట్ గార్డ్ నౌకలతో పాటు రెండు నేవీ హెలికాప్టర్లు బంగాళాఖాతంలో తీవ్రంగా శోధిస్తున్నాయి. విశాఖపట్నం, చెన్నై నుంచి వచ్చిన నేవీ నౌకలు సముద్రంలో అత్యంత లోతైన ప్రాంతాల్లో అన్వేషణ కొనసాగిస్తున్నాయి. కాకినాడ, విశాఖ కోస్ట్ గార్డ్ బృందాలు, మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో నేడు ఐదో రోజు కూడా గాలింపు పక్రియను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు పోలీసులు బాధితుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరించి, వారి కాల్ డేటాను విశ్లేషిస్తూ సాంకేతిక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, సదరు బోటులో ముందస్తు జాగ్రత్తగా ఊ÷ఎఈ ట్రాన్స్‌పాండర్ పరికరాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్లే కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయి, వారి లొకేషన్‌ను గుర్తించడం కష్టతరంగా మారింది. మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు తీవ్ర భయాందోళనలతో ఎదురుచూస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను రాజమండ్రి ప్రతినిధి శ్రీనివాస్ త్వరలోనే అందించనున్నారు.

# నాభర్తను విడిచి పెట్టండి

**బ్రిటన్‌కు భారతీయ నావికుడి భార్య వినతి**

న్యూఢిల్లీ,ఆగస్ట్22(ఆర్ఎన్ఎ): రష్యా 'షాడో ఫ్లీట్'కు చెందినదిగా అనుమానిస్తున్న చమురు ట్యాంకర్‌పై ఇటీవల బ్రిటన్ దళాలు దాడి చేసి.. ఓ భారతీయుడిని అరెస్ట్ చేశాయి. ఈ ఘటనపై ఆ భారత నావికుడి భార్య మాట్లాడుతూ.. తన భర్తను బలిపశువును చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కేవలం తన యజమాని ఆదేశాలను మాత్రమే పాటించారని చెప్పారు. సదరు నౌక ఇంగ్లిష్ ఛానల్ మీదుగా ప్రయాణిస్తుండగా.. బ్రిటన్ కమాండోలు అందులోకి ప్రవేశించారు. నౌక కెప్టెన్‌గా ఉన్న 38ఏళ్ల అజయ్ పంత్‌ను అరెస్ట్ చేశారు. ఇటీవల అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసులో అతడు గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్షను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అజయ్ భార్య రితూ పంత్ మీడియాతో మాట్లాడుతూ.. 'నౌక యజమాని వద్ద నా భర్త కేవలం ఓ ఉ ద్యోగి మాత్రమే. యాజమాన్యం ఎలా చెబితే అలాగే చేశారు. తాను చేసిన తప్పేంటో కూడా అర్థం కావట్లేదని ఆయన వాపోతున్నారు. చేయని తప్పునకు జైల్లో కుమిలిపోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నౌకలో 98వేల టన్నుల చమురును అక్రమంగా రవాణా చేస్తున్నారన్నది బ్రిటన్ ఆరోపణ. నౌక కెప్టెన్‌గా కార్గోలో ఏముందో అజయ్ పంత్‌కు కచ్చితంగా తెలుసునని బ్రిటిష్ ప్రాసిక్యూషన్ కోర్టులో వాదించింది. అయితే, దీన్ని అజయ్ న్యాయవాది తోసిపుచ్చారు. కెప్టెన్ బాధ్యత కేవలం నౌకలోని కార్గోను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమేనని, అందులో ఏముందో వారికి తెలిసే అవకాశం లేదని అన్నారు. ఈ కేసుపై డిసెంబరు 15 నుంచి విచారణ జరగనుంది. మరోవైపు, కాన్సులార్ అనుమతితో బ్రిటన్ జైల్లో ఉన్న అజయ్ పంత్‌ను భారత విదేశాంగ శాఖ కలిసి ఘటన గురించి తెలుసుకుంది. జూన్ 14న ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కామెరూన్ జెండాతో ఉన్న చమురు ట్యాంకర్ 'స్కిట్రోస్'.. ఇంగ్లిష్ ఛానల్‌లో ప్రయాణిస్తున్న సమయంలో బ్రిటన్ సైనిక దళాలు అందులోకి ప్రవేశించాయి. 6 గంటలపాటు సాగిన ఈ ఆపరేషన్‌లో బ్రిటన్ రాయల్ మెరైన్ కమాండోలు, ఎన్‌సీఏ అధికారులు పాల్గొన్నారు. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉండగా.. కెప్టెన్‌గా ఉన్న అజయ్‌ను బ్రిటన్ దళాలు అరెస్ట్ చేశాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు.. రష్యా వందల సంఖ్యలో నౌకలను వివిధ దేశాల జెండాలతో నడుపుతోంది.



# వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్లు

**మూడో విడత పరిహారం అందజేసిన ముఖ్యమంత్రి**

**2,027 కుటుంబాలకు లబ్ధి చేకూరింపు**

ప్రకాశం, ఆగస్టు 22: వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మూడో విడతగా రూ.250 కోట్ల పరిహారాన్ని అందజేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు పరిహారం చెక్కును అందజేశారు. ఈ చెల్లింపులతో ఇప్పటి వరకు మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో పరిహారం పంపిణీ చేపట్టింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను చెల్లించింది. తాజాగా మూడో విడతలో 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారాన్ని అందజేసి పునరావాస ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. వెలిగొండ ప్రాజెక్టు కారణంగా భూములు, ఆస్తులు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ చెల్లింపులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. పరిహారం చెల్లింపులు వేగంగా పూర్తిచేయడం ద్వారా పునరావాస కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. కేవలం 48 రోజుల వ్యవధిలోనే నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల భారీ మొత్తాన్ని చెల్లించడం విశేషమని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని పరిహారం పంపిణీ ప్రక్రియను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు తదితరులు పాల్గొన్నారు. నిర్వాసిత కుటుంబాలతో వారు ముచ్చటించి ప్రభుత్వ చర్యలపై వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు రాష్ట్రంలో కీలక సాగునీటి ప్రాజెక్టులలో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రాజెక్టు పనులు పూర్తయితే ప్రకాశం, నెల్లూరు జిల్లాల విస్తార ప్రాంతాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.





## ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి స్వాగతం పలికిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

శృంగవరపుకోట, ఆగస్టు 22: స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి స్వగృహానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని హెలిపాడ్ వద్ద రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలిసి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి పుష్పగుచ్ఛం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారితో కలిసి ఎమ్మెల్యే లలిత కుమారి ఇంటికి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించటంతో పాటు ఆశీర్వాదం అందజేశారు.



## యువ మంత్రి నారా లోకేష్ గారికి ఘనస్వాగతం

**జనసంద్రమైన వై జంక్షన్.. చినుకుల్లోనూ తగ్గని అభిమానం .. ప్రతి ఒక్కరితో కరచాలనం చేసిన లోకేష్ గారు**

విజయనగరం, ఆగస్టు 22: జిల్లాకు తొలి సారి విచ్చేసిన ఐటీ, విద్య మరియు మానవ వనరుల శాఖ మాత్యులు నారా లోకేష్ గారికి స్థానిక వై జంక్షన్ వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు, ఇన్చార్జ్ మంత్రి వంగలపూడి అనిత గారు, ఎమ్మెల్యే ఆదితి విజయలక్ష్మి గారు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గారు, పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున గారు, ఉత్తరాంధ్ర ఇన్చార్జ్ ఆరుమిల్లి రాధాకృష్ణ గారు ఇతర నాయకులు, అభిమానులతో కలిసి భారీ స్వాగతం పలికారు. స్వాగత ఏర్పాట్లలో భాగంగా కోలాటం, తీన్మార్, కేరళ డప్పు వాయిద్యాలతో పాటు పులి వేషదారులతో కలిసి మంత్రి నారా లోకేష్ గారికి స్వాగతం పలికారు. భారీగా తరలివచ్చిన అభిమానులతో వై జంక్షన్ జనసంద్రంతో కిక్కిరిసిపోయింది. లోకేష్ గారితో కరచాలనం చేయటానికి, సెల్ఫీలు తీయించుకోవటానికి మహిళలు, యువకులు పోటీపడ్డారు. యువకులు సీఎం సీఎం అంటూ నినాదాలు చేయటం ఆశ్చర్యాన్ని కలిగించింది. చినుకులు పడుతూ ఉన్ననూ ప్రతి కార్యకర్త ఆనందంతో మంత్రి నారా లోకేష్ గారి కాన్వాయ్ ను ముందుకు సాగనివ్వలేదు. ఎంతో ఓపికతో లోకేష్ గారు ప్రతి ఒక్కరికి అభివాదం చేస్తూ, కరచాలనం చేసుకుంటూ ముందుకు సాగారు. అత్యధిక స్థాయిలో భారీ అభిమాన, కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## కళాత్మకంగా స్వయం ఉపాధి..

**సృజనాత్మకతకు శిక్షణతో మహిళలకు ప్రోత్సాహం.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

మహిళలు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను ఒడిసిపట్టుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్వయం సహాయక సంఘాల మహిళలకు సూచించారు. శనివారం ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి రైజ్ కేంద్రంలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎకో క్రాఫ్ట్స్, ఫైన్ ఆర్ట్స్‌పై వర్క్‌షాప్ జరిగింది. నారీ వస్త్ర ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు సుష్మ 70 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహిళల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పర్యావరణహిత వస్తువుల తయారీ, కళాత్మక ఉత్పత్తుల రూపకల్పన వంటి అంశాల్లో శిక్షణ పొందడం ద్వారా ఇంటి వద్దే ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో పెట్టి స్వయం ఉపాధికి మార్గాలు వేసుకోవాలన్నారు. తయారు చేసిన ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ కల్పించడం, మార్కెట్ అవసరాలు, ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులను రూపొందించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చున్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడం ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిగతులతో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా అందిస్తున్న శిక్షణ, ప్రోత్సాహకాలు, స్వయం ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.



## డుచెన్ వ్యాధిపై అవగాహనా కార్యక్రమం!

**సెప్టెంబర్ 7న వరల్డ్ డుచెన్ అవేర్‌నెస్ డే సందర్భంగా నిర్వహణలి**

**అరుదైన వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంలి**

డుచెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ (డీఎండీ) అరుదైన జన్యుపరమైన వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 7న వరల్డ్ డుచెన్ అవేర్‌నెస్ డే సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సహాయసహకారాలు అందించాలని అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శోభారాణి సుంకర జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమానికి అవసరమైన సంబంధిత శాఖల సమన్వయం, సహకారం అందిస్తామంటూ ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సానుకూలంగా స్పందించారు. ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా సమష్టి కృషితో లక్ష్యాల సాధనకు కృషిచేస్తున్నామని, ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. డీఎండీ అరుదైన జన్యుపరమైన వ్యాధి కాగా, సకాలంలో వ్యాధి నిర్ధారణ, జన్యు పరీక్షలు, వైద్య చికిత్స, పునరావాసం, సామాజిక సహాయ సేవలపై తల్లిదండ్రులు, సంరక్షకులు, ప్రజలు, వైద్య నిపుణుల్లో అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని శోభారాణి సుంకర ఈ సందర్భంగా తెలిపారు. యాక్సెస్ ఛేంజెస్ లైవ్స్ అనే 2026 సంవత్సరపు థీమ్‌కు అనుగుణంగా డీఎండీతో పాటు పాటు ఇతర అరుదైన వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు, కుటుంబాలకు సకాలంలో వైద్యం, పునరావాసం, విద్య, సామాజిక సహాయ సేవలు అందుబాటులోకి రావాల్సిన అవసరాన్ని కార్యక్రమం ద్వారా చాటిచెప్పనున్నట్లు పేర్కొన్నారు.



## స్వచ్ఛతకు ప్రతి అడుగు.. ఆరోగ్యాంధ్రకు ముందడుగు

**సమష్టి భాగస్వామ్యమే స్వచ్ఛాంధ్రకు బలమైన పునాదిలి**

**ప్రతిఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి**

**పరిశుభ్రమైన పరిసరాలతోనే మన ఆరోగ్యకరమైన భవిష్యత్తు**

**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

జిల్లాలో గ్రామగ్రామాన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విస్తృతంగా నిర్వహిస్తున్నామని.. ఇవి మంచి ఫలితాలు ఇస్తున్నాయని, మనం స్వచ్ఛతవైపు వేసే ప్రతి అడుగు ఆరోగ్యాంధ్రకు ముందడుగు అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

శనివారం జి.కొండూరులోని కమ్యూనిటీ హాల్ వద్ద జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. భారత సుప్రీంకోర్టు ఆదేశాలు-ఘన వ్యర్థాల నిర్వహణ మన బాధ్యత, మన కర్తవ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి ఆచరణలో పెట్టినప్పుడే శాశ్వతమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. మన నుంచి, మన కుటుంబం నుంచి, మన గ్రామం నుంచి స్వచ్ఛతకు సంబంధించిన మంచి అలవాట్లు కొనసాగాలని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు, వాయు కాలుష్యానికి కారణమవుతున్న నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అని.. మనం ఈరోజు తీసుకునే చిన్నచిన్న జాగ్రత్తలే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన, పర్యావరణహిత భవిష్యత్తును అందిస్తాయని పేర్కొన్నారు.

# ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం

- ప్రభుత్వ హామీలపై బీఆర్ఎస్ విమర్శలు
- ఈహెచ్ఎస్, వేతనాల అంశాల ప్రస్తావన
- సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్
- తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యలు




**హైదరాబాద్, ఆగస్టు 22 :**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లక్షలాది మంది ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మి ఆ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఉద్యోగులను వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా బీఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమైందని శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యోగులు ముందుండి పోరాడారని, వారి త్యాగాలను మరువరాదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటుకు ఉద్యోగులు చేసిన కృషిని దేశ నాయకులు కూడా ప్రశంసించారని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలులో తీవ్ర లోపాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఉద్యోగుల నుంచి ఆరోగ్య పథకం కోసం నిధులు వసూలు చేస్తున్నప్పటికీ ఆసుపత్రుల్లో సేవలు అందడం లేదని విమర్శించారు. ఈ పరిస్థితుల వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు, కరవు భత్యాల అంశాలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆయన విమర్శించారు. ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించిన నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అనే హామీ కూడా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ముఖ్యంగా సీపీఎస్ రద్దు అంశాన్ని కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో చేర్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి చాలా కాలం గడిచినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. సీపీఎస్ రద్దు అయ్యే వరకు ఉద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఏ వర్గానికి అన్యాయం జరిగినా బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో జి. దేవి ప్రసాద్, సుమిత్రానంద్, మామిళ్ల రాజేందర్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, సమావేశంలో చేసిన ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయాలని, వాటిపై ప్రభుత్వ స్పందన వెలువడాల్సి ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

# రాజా బహదూర్ విగ్రహావిష్కరణ ఘనంగా

- విద్యాభివృద్ధికి వెంకట్రామారెడ్డి సేవల ప్రశంస
- పేద విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపు
- హాస్టల్, పాఠశాల ఏర్పాటుకు సహకారం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**సిద్దిపేట, ఆగస్టు 22 :**

సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజా బహదూర్ కొత్వాల్ వెంకట్రా మారెడ్డి విగ్రహాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఉపనేత హరీశ్ రావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి 157వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ఒక వ్యక్తి తాను మాత్రమే అభివృద్ధి చెందడం కంటే తనతో పాటు మరికొందరిని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన గొప్పతనమని అన్నా రు. ఆ విలువలను ఆచరణలో చూపించిన మహనీయుల్లో రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి ఒకరని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పా రు. హైదరాబాద్ కొత్వాల్‌గా పనిచేసిన కాలంలోనే విద్య ప్రాముఖ్యతను గుర్తించి విద్యార్థుల కోసం, ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి కోసం రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. ఆ హాస్టల్ ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని, సమాజానికి సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. సిద్దిపేటలో కూడా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో హాస్టల్ లేదా విద్యాసంస్థ నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చినట్లు హరీశ్‌రావు తెలిపారు. సంఘ నాయకులు చర్చించి అవసరాన్ని నిర్ణయిస్తే దాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యాభివృద్ధి కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రెడ్డి సంక్షేమ భవన్ నిర్మాణ చరిత్రను గుర్తు చేసిన హరీశ్‌రావు, ప్రభుత్వంలోకి రాకముందే ఈ భవన నిర్మాణం ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం వివిధ సామాజిక వర్గాలకు కూడా ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఫంక్షన్ హాల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్య కోసం వినియోగించాలని నూతన కమిటీకి సూచించారు. ఆ నిధుల్లో సగభాగం రెడ్డి సామాజిక వర్గంలోని పేద విద్యార్థులకు, మిగతా సగభాగం ఇతర వర్గాల పేద విద్యా ర్థులకు కేటాయించాలని కోరారు. వైద్య, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశం పొందిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తే ఒక కుటుంబం మాత్రమే కాదు, ఒక తరం అభివృద్ధి చెందుతుందని హరీశ్‌రావు అన్నారు.

# హిందూ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ ప్రారంభం

- విద్యా మౌలిక వసతుల బలోపేతంపై కేంద్రం దృష్టి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 22 :**

సనత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హిందూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. విద్యా రంగంలో నాణ్యమైన అవకాశాలు కల్పించే దిశగా ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాట్లాడిన కిషన్ రెడ్డి, హిందూ పబ్లిక్ స్కూల్‌కు ఉన్న గొప్ప వారసత్వాన్ని గుర్తు చేశారు. దశాబ్దాలుగా విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఈ సంస్థ, ఇంజినీరింగ్ కళాశాల స్థాపన ద్వారా తన సేవలను మరింత విస్తరించిందన్నారు. విద్యా ప్రమాణాలను పెంపొం దిస్తూ యువతకు ఆధునిక సాంకేతిక విద్యను అందించడం లో ఈ అడుగు కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, విలువలతో కూడిన విద్య అందించాలనే దూర దృష్టితో పనిచేసిన దాత, విద్యాభిమానిగా పేరుగాంచిన కంజెర్ల శంకర్ యాదవ్ సేవలను ఈ సందర్భంగా మంత్రి స్మరిం చారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుం డా సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విద్యా రంగంలో వేగంగా మార్పులు చోటుచే సుకుంటున్నాయని, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత విద్యకు ప్రాధాన్యం పెరుగుతోందని కిషన్ రెడ్డి అన్నారు. ఇంజినీ రింగ్, విజ్ఞానశాస్త్రం, పరిశోధన రంగాల్లో భారత యువత ప్రపంచ స్థాయి లో రాణించేందుకు అవసరమైన అవకా శాలను ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వ్యాప్తంగా విద్యా మౌలిక వసతు లను బలో ేతం చేస్తున్నట్లు మంత్రి వివరిం చారు. కొత్త విద్యాసంస్థలు, పరిశోధనా కేం ద్రాలు, నైపు ణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువ తను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేస్తు న్నామని తెలిపా రు. విద్యా రంగం లో పెట్టుబ డులు దేశాభి వృద్ధికి బలమైన పునాదిగా నిలయని చెప్పా రు. హిందూ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రారంభం తో సనత్ నగర్ ప్రాంతంలో ఉన్నత విద్యకు కొత్త అవకాశాలు లభించనున్నాయి. సాంకేతిక విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి ఈ సంస్థ కేంద్రంగా మారాలని, విద్యా ర్థులు జాతీ య, అంతర్జా తీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని మంత్రి ఆకాంక్షించారు. విద్యా వార స త్వాన్ని కొనసా గిస్తూ కొత్త తరాలకు మార్గదర్శకంగా ఈ సంస్థ నిలవాలని అభిల షించారు.

# కొల్లాపూర్‌లో క్రీడా వసతుల విస్తరణ

- ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులకు ఆదేశాలు
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు



**నాగర్‌కర్నూలు, ఆగస్టు 22 :**

కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ నేపథ్యంలో పెంట్లవెల్లి మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పెంట్లవెల్లితో పాటు కొల్లాపూర్ పట్టణం, వీపనగండ్ల, పానగల్ మండలం కేతపల్లి గ్రామం, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో కూడా స్టేడియాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అవసరమైన స్థలాల గుర్తింపు, సాంకేతిక అంశాల పరిశీలన కొనసాగుతోందని పేర్కొన్నారు. క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. క్రీడా మైదానాలు, స్టేడియాలు అందుబాటులోకి వస్తే ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత శారీరక దృఢత్వం పెంపొందించుకోవడంలో కూడా ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం పెంట్లవెల్లి మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు, ప్రజా సేవల అందజేతలో జాప్యం వంటి అంశాలపై చర్చించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సిన బాధ్యత అధికారు లపై ఉందని మంత్రి అన్నారు. రెవెన్యూ సంబంధిత పెండింగ్ అంశాలను ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరిం చాలని సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సేవల్లో జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించబోమని అధికారులను హెచ్చరించారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపైనా ప్రభుత్వం సమానంగా దృష్టి సారిస్తోందని ఆయన స్పష్టం చేశారు.




# బతుకమ్మ వేళ యువ చిత్రకారులకు వేదిక

- కొత్తగా జానపద గీతాలు, వ్యాసాలకు అవకాశం
- విజేతలకు రూ.3 లక్షల వరకు నగదు బహుమతులు

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్--2026 సీజన్--2' పోటీల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబు పాల్గొన్నారు. యువతలోని సృజనాత్మకతను వెలికితీసి సినీ రంగానికి కొత్త ప్రతిభను పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ వంటి పండుగలు, జానపద కళారూపాలు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ఆధారంగా లఘు చిత్రాలు, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత ఏడాది నిర్వహించిన పోటీలకు మంచి స్పందన లభించిందని, ఈసారి మరింత విస్తృత స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. యువ దర్శకులు, రచయితలు, గాయకులు, కంటెంట్ సృష్టికర్తలకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. ఈ ఏడాది పోటీల్లో కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టారు. జానపద గీతాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సామాజిక మాధ్యమాల ప్రభావశీలులు రూపొందించే వీడియోలు, వ్యాసాలకు ప్రత్యేక స్థానం కల్పించారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సృజనాత్మక రచనలు, వీడియోలను ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని నిర్వాహకులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా యువ ప్రతిభ ముందుకు రావాలని వారు ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలు కల్పించే వేదికగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలు, పండుగలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా చేరేందుకు ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే యువతను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. పోటీలకు పంపే లఘు చిత్రాల నిడివి మూడు నిమిషాలకు మించకూడదని, పాటల నిడివి ఐదు నిమిషాల లోపే ఉండాలని నిర్వాహకులు స్పష్టం చేశారు. అన్ని వీడియోలు 4కే నాణ్యతతో ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు తమ ఎంట్రీలను సెప్టెంబర్ 15లోపు ఇ-మెయిల్ లేదా వాట్సాప్ ద్వారా పంపాలని తెలిపారు. అనంతరం సినీ, సృజనాత్మక రంగ నిపుణులతో కూడిన జ్యూరీ ఉత్తమ రచనలు, చిత్రాలను ఎంపిక చేయనుంది. పోటీలలో విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులను ప్రకటించారు. ప్రథమ బహుమతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.1 లక్ష అందజేయనున్నారు. అదనంగా ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులుగా రూ.20 వేల చొప్పున ప్రదానం చేస్తారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు కూడా అందజేస్తారు. తెలంగాణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



# స్కూల్ ఎడ్యుకేషన్--టి-సాట్ మధ్య ఒప్పందం

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్యను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ మరియు టి-సాట్ మధ్య ప్రత్యేక అవగాహన ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ పాఠ్యాంశాలను క్రమబద్ధంగా అందించే అవకాశాలు మరింత విస్తరించనున్నాయి. ముఖ్యంగా తొమ్మిదో, పదో తరగతి విద్యార్థుల కోసం సాయంత్రం వేళల్లో ప్రత్యేక డిజిటల్ తరగతులను నిర్వహించనున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాల సమయం తర్వాత కూడా నాణ్యమైన బోధనను పొందే అవకాశం కలగనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 28 వేల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఇకపై టి-సాట్ వేదికగా ప్రసారం కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే 'ముఖాముఖి' కార్యక్రమంతో పాటు 'మా జిల్లా--మా పాఠశాల' పేరుతో జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్వహించే కార్యక్రమాలు కూడా ఈ వేదిక ద్వారా ప్రజలకు చేరనున్నాయి. ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలకు కూడా ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. 'టి.ఎల్.ఎం మేళా' వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులకు కొత్త బోధనా పద్ధతులు, విద్యా సామగ్రి వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. డిజిటల్ సాంకేతికతను విద్యలో సమర్థవంతంగా వినియోగించేందుకు ఇది దోహదపడనుంది. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ నికోలస్, బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను దేశంలోనే అత్యుత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో డిజిటల్ విద్య కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. డిజిటల్ కంటెంట్ ప్రసారాల విషయంలో ఈ ఒప్పందం స్పష్టత, సమన్వయాన్ని తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు. డిజిటల్ విద్యా కార్యక్రమాలన్నింటినీ టి-సాట్ ద్వారా సమర్థవంతంగా నిర్వహించేలా సమగ్ర శిక్ష, రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి తదితర విభాగాలు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పీవీ శ్రీహరి, టి-సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎండీ సాధిక్, జనరల్ మేనేజర్ లింగారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తులపై మంత్రి ఆగ్రహం

**నిజామాబాద్, ఆగస్టు 22 :**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరి ష్కారం చూపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాగారం లోని నిర్మితి కేంద్రంలో ప్రతిపాదిత ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలిం చడంతో పాటు పాముల బస్తీలో ఇంది రమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖా ముఖి నిర్వహిం చారు. అనంతరం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయింపు పత్రాలను అందజేశా రు. తరువాత కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌ సింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమీక్ష సమావే శంలో మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేసే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబో మని హెచ్చరించా రు. ముఖ్యంగా భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదా బైనామా అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శి స్తున్న తహసీల్దా ర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పు తూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్ప వని స్పష్టం చేశారు.



పదేపదే సూచించినా పనితీ రులో మార్పు రాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వ లక్ష్యం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించ డమేనని, ప్రతి అధికారి బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. వ్యవసాయ భూములతో పాటు ఆబాదీ ఆస్తుల రీ-సర్వేను కూడా ఏడాదిన్నర లోపు పూర్తి చేయాలని లక్ష్యం గా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో తొలి దశ సర్వే కొనసాగుతోందని తెలిపారు. రీ-సర్వే జరుగుతు న్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వివా దాలకు ముగింపు పలికి ప్రజలకు స్పష్టమైన హక్కులను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉ ద్దేశమని పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొంగులేటి అన్నారు. కులం, మతం, రాజకీ యాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుం బానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాల్లో స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో ఇంది రమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇందులో భాగం గానే నిజామాబాద్‌లో టవర్స్ నిర్మాణానికి అను వైన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఇంది రమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గిం చేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని వెల్లడించారు. దీంతో పేద కుటుం బాలపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా ఇళ్ల నిర్మాణం వేగవంతం అవుతుందని వివరించా రు. పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను మంత్రి స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లుల చెల్లింపులు, నిర్మాణ పురోగతి, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమకు సొంతింటి కలను నెరవేర్చిం దని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేయగా, వారి సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నా రు. నూతన గృహ ప్రవేశం చేసిన కుటుంబా లకు శు భాకాంక్షలు తెలియజేస్తూ నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేసు కోవాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాలను పరిశీలించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను మంత్రి అందజే శారు. మరో వారం నుంచి పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లకు ఇప్పటికే మంజూరు ఇచ్చినట్లు తెలిపారు.




# సైబరాబాద్‌లో ఆక్రమణలపై ఉక్కుపాదం

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ (సీఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారాంతపు 'వాక్ ఫ్రీ' కార్యక్రమంలో భాగంగా మూడు జోన్ల పరిధిలో విస్తృత స్థాయిలో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. ప్రజల కోసం రోడ్లు, ఫుట్‌పాత్‌లు, బహిరంగ ప్రదేశాలను తిరిగి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 16.55 కిలోమీటర్ల మేర విస్తరించిన ప్రాంతాల్లో 243 ఆక్రమణలను తొలగించారు. సెరిలింగంపల్లి జోన్‌లో 5.75 కిలోమీటర్ల పరిధిలో 108 ఆక్రమణలను తొలగించారు. నార్సింగిలో 20, పటాన్‌చెరులో 25, అమీన్‌పూర్‌లో 13, మియాపూర్‌లో 15, సెరిలింగంపల్లిలో 35 ఆక్రమణలను అధికారులు తొలగించారు. ప్రజల రాకపోక లకు ఆటంకం కలిగిస్తున్న నిర్మాణాలు, వ్యాపార విస్తరణలను తొలగించి మార్గాలను స్వేచ్ఛగా వినియోగిం చుకు నేలా చర్యలు తీసుకున్నారు. కూకట్‌పల్లి జోన్‌లో 3.8 కిలోమీటర్ల మేర తనిఖీలు నిర్వహించి 13 ఆక్రమణలను తొలగించారు. మూసాపేట పరిధిలో ఈ చర్యలు చేపట్టగా, ఇతర సర్కిళ్లలో పోలీసు బలగాలు అందుబాటులో లేకపోవడంతో డ్రైవ్‌ను మరో తేదీకి వాయిదా వేశారు. త్వరలోనే అక్కడ కూడా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. కుత్బుల్లాపూర్ జోన్‌లో అత్యధికంగా 122 ఆక్రమణ లను తొలగించారు. చింతల్‌లో 15, జీడిమెట్లలో 18, కొంపల్లిలో 12, గాజులరామారంలో 20, నిజాంపేట్‌లో 16, దుండిగల్‌లో 18, మేడ్చల్‌లో 23 ఆక్రమణలను తొలగించి ప్రజా ప్రదేశాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణల తొలగింపుతోనే ఆగిపో కుండా, ఇప్పటికే ఖాళీ చేసిన ప్రాంతాల్లో మళ్లీ ఆక్రమణలు జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ అధికారులు వెల్లడించారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రహదారులు, ఫుట్‌పాత్‌లు అందించడమే 'వాక్ ఫ్రీ' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొ న్నారు. సైబరాబాద్ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణల రహితంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల సహకారంతో నగరాన్ని మరింత పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'వాక్ ఫ్రీ' కార్యక్రమం ద్వారా ప్రజా స్థలాల సంరక్షణకు కొత్త దిశ లభిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా

**ఉట్నూరు, ఆగస్టు 22 :**

దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరు గుపరచడంతో పాటు వారిని సమాజంలో మరింత స్వావలంబన దిశగా నడిపిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, గిరిజన, వికలాం గుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ఉట్నూరులోని కేబీ కాంప్లెక్స్‌లో మహిళా, శిశు, వికలాం గుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ' కార్యక్రమా నికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా దివ్యాంగుల అవసరా లను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన వివిధ సహాయక పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం రూ.30.68 లక్షల విలువగల 26 సహాయ ఉపకరణాలను లబ్ధిదారులకు అందజే శారు. వీటిలో దివ్యాంగుల దైనందిన జీవితాన్ని సులభతరం చేసే పరికరాలు, కదలికలకు సహాయపడే సాధనాలు, ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా రూ పొందించిన ఉపకరణాలు ఉన్నాయి. ఈ పరికరాలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొం దించడంతో పాటు విద్య, ఉపాధి, సామాజి క కార్యకలాపాల్లో మరింత చురు కుగా పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తాయ ని అధికా రులు తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, దివ్యాంగులు సమా జంలో సమాన అవకాశాలు పొందే లా



ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్ర మాలు అమలు చేస్తోందన్నారు. వారికి విద్య, ఉ పాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి రంగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సమస్యలను అర్థం చేసుకుని వాటికి తగిన పరిష్కారాలు అందించడంలో ప్రభుత్వం ముందుం టుందని పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగుడు గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండె విఠల్ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించారు. సహాయ ఉపకరణాలు అందుకోవడం ద్వారా దివ్యాంగుల జీవన నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయడంలో అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలో దివ్యాంగుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సేవలు, సౌకర్యాలు అందిం చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దివ్యాంగుల సాధికారత కోసం వివిధ శాఖల సమన్వ యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్య లో దివ్యాం గులు పాల్గొన్నారు. సహాయ ఉపకరణాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల సమగ్ర అభివృద్ధి, సామాజిక భాగస్వామ్యం, ఆత్మనిర్భరత లక్ష్యంగా ప్రభుత్వం చేపడు తున్న కార్యక్రమాలు వారికి కొత్త ఆశలను నింపుతున్నాయని పేర్కొన్నారు.



# సూర్యాపేట మున్సిపాలిటీ సమస్యలు పరిష్కరించాలి

**సూర్యాపేట, ఆగస్టు 22 :**

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. పట్టణ, పరిసర ప్రాంతా ల్లోని చెరు వులను పునరుద్ధరించి ప్రజల తాగునీరు, సాగునీటి అవసరాలకు వినియోగించాలని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి ఆగస్టు 20 వరకు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పాదయాత్రలో తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పార్టీ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ పాదయాత్రలో పట్టణ ప్రజలు ఎదుర్కొం టున్న అనేక సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించినట్లు తెలిపారు. వాటిలో కొన్నింటిని తక్షణమే పరిష్కరించాల్సి ఉండగా, మరికొన్నింటిని దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

**సూ ర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే రూ.500 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అస్తవ్య స్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని పేర్కొన్నారు. కాలువల్లో పూడిక తొలగిం చకపోవడంతో అనేక వార్డుల్లో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంద న్నారు. దోమలు, ఈగల నివారణకు ఫాగింగ్ సక్రమంగా చేపట్టకపోవడంతో మలే రియా, ఫైలేరియా వంటి వ్యాధు ల బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. అనేక వార్డు ల్లో మున్సిపల్ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సూర్యాపే ట పట్టణం చుట్టూ నీటి వనరులు ఉన్నప్పటికీ వాటిని సమర్థంగా వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్ల పట్టణ ప్రజలు తాగునీటికి, పరిసర గ్రామాల ప్రజలు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నా రు.**

పట్టణం, పరిసర ప్రాంతాల్లోని చెరువులన్నింటినీ పునరుద్ధరించి తాగునీరు, సాగునీరు తదితర అవసరా లకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని చిన్న వ్యాపారులు తమ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అనువైన స్థలాలు లేక నష్టపోతు న్నారని శివకుమార్ పేర్కొన్నారు. చిరు వ్యాపారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా వారికి అనువైన ప్రాంతాల్లో వ్యాపార స్థలాలను కేటాయించాలని కోరారు. మున్సిపాలిటీ సిబ్బందికి ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్ డిపో, బస్ స్టేషన్ తదితర విభాగాల సిబ్బందితో సరైన సమన్వయం లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలు తలెత్తు తు న్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని సూర్యాపేటను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దాలని కోరారు.

# పీఎం శ్రీ పాఠశాలల్లో నాణ్యతకు ప్రాధాన్యం

**నారాయణపేట, ఆగస్టు 22 :**

పీఎం శ్రీ పాఠశాలలను జిల్లాలో ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థుల భద్రత, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని 19 పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నెలవారీగా తాము చేపట్టిన ఉత్తమ కార్యక్రమాలు, వాటి ఫలితాలు, విద్యార్థుల్లో వచ్చిన మార్పులు, భవిష్యత్ కార్యాచరణను ప్రదర్శించే విధంగా ప్రత్యేక ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి నెల నిర్వహించే సమీక్ష సమావేశాల్లో పాఠశాలలు తమ విజయవంతమైన కార్యక్రమాలను ఇతర పాఠశాలలతో పంచుకోవడం ద్వారా మంచి పద్ధతులను విస్తరించవచ్చని తెలిపారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రతి పాఠశాల వినూత్న కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని పేర్కొన్నారు. బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్ అంశంపై వచ్చే వారంలోనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైతే నిపుణులను పాఠశాలలకు ఆహ్వానించి ప్రదర్శనాత్మకంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులను తరగతుల వారీగా విభజించి భద్రతా అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాట్లు పెంపొందించేందుకు పిగ్గీ బ్యాంక్ కార్యక్రమాలు నిర్వహించాలని, డబ్బు విలువ, ఆర్థిక నిర్వహణ, పొదుపు ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో చట్ట విజ్ఞానం, సైబర్ సేఫ్టీ, స్వీయ రక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక పోలీసు శాఖ, సైబర్ విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, బాలల హక్కులు, సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవసరమైన చోట స్థానిక ఎస్ఐలు, సైబర్ నిపుణులను పాఠశాలలకు ఆహ్వానించి ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ యుగంలో విద్యార్థులు భద్రంగా ఉండేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. పీఎం శ్రీ పాఠశాలలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. గ్రీనరీ అభివృద్ధి, పాఠశాలల సుందరీకరణ, క్లబ్బుల ఏర్పాటు, గ్రంథాలయాల అభివృద్ధి, కళలు, చేతిపనుల కార్యక్రమాలకు అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేయాలని తెలిపారు. నిధులు ఖర్చు చేయడమే కాకుండా వాటి ద్వారా విద్యార్థులకు కలిగిన ప్రయోజనాలు, సాధించిన ఫలితాలను నెలవారీ నివేదికల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ



విద్యా సంవత్సరంలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రతి పాఠశాల ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బేస్‌లైన్ సర్వే ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విజువల్ లెర్నింగ్, ప్రయోగాత్మక బోధన, ఆధునిక విద్యా పద్ధతులను ఉపయోగించి పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థుల సామర్థ్యాలను మరింత పెంపొందించే చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, పీఎం శ్రీ పాఠశాలలు విద్యా ప్రమాణాలు, భద్రత, నైపుణ్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం, సాంకేతిక అవగాహనలో ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.



# పవర్‌ఫుల్ తెలంగాణకు విద్యుత్ బాట

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

తెలంగాణను విద్యుత్ కొరతలేని శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్య మంత్రి, విద్యుత్ మరియు ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి విద్యుత్ రంగం కీలకమని పేర్కొంటూ, పెరుగుతున్న అవస రాలకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్--2026ను శనివారం ప్రారంభించిన ఆయన, విద్యుత్ రంగంలో తెలంగాణ సాధిస్తున్న పురోగ తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా చర్యలు కొనసా గుతున్నాయని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో విద్యుత్ రంగానికి సంబంధించిన ఆధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలు, వినియోగదారుల సేవలు, విద్యుత్ సంస్థల విజయాలను ప్రతిబింబించే ప్రత్యేక స్టాళ్లను ఉప ముఖ్యమంత్రి పరిశీలిం చారు. టీజీఎస్పీడీసీఎల్ రూపొందించిన ప్రత్యేక మస్కట్‌ను ఆవిష్కరించడంతో పాటు సంస్థ విజయాలు, సంస్కరణలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై రూపొందించిన బ్రోచర్లను విడుదల చేశారు. విద్యుత్ రంగంలో జరుగుతున్న మార్పుల ను ప్రజలకు చేరవేయడంలో ఇటువంటి ప్రదర్శనలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క, తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పరిశ్రమలు, వ్యవసాయం, సేవారంగం అభివృద్ధి చెందాలం టే నిరంతర విద్యుత్ సరఫరా అత్యవసరమని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 18 వేల మెగావా ట్లకు పైగా పెరిగినా, ముందస్తు ప్రణాళికలు, బలమైన ప్రసార మరియు పంపిణీ వ్యవస్థల వల్ల ఎక్కడా అంతరా యం లేకుండా విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని థర్మల్, సోలార్, జలవిద్యుత్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపా రు. వినియోగ దారుల సేవలను మరింత మెరుగుపర్చేందుకు 1912 టోల్ ఫ్రీ సేవలు, పవర్ అంబులెన్స్ వ్యవ స్థ, డిజిటల్ సాంకేతికత ఆధారిత సేవలను విస్తృతంగా అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి వివరిం చారు. ప్రజలు ఎదు ర్కొనే సమస్యలను వేగంగా పరిష్కరిం చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపా రు. విద్యుత్ రంగంలో పారదర్శకత, సేవల నాణ్యత, భద్రతా ప్రమాణాలను మరింత పెంచడం ద్వారా వినియో గదారుల విశ్వాసాన్ని బలోపేతం చేస్తు న్నామని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అధిక పీక్ డిమాండ్ ఉన్న సమయంలో కూడా నిరంత రాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్న విద్యుత్ సంస్థల పనితీరు ప్రశంసనీయమని అన్నారు.

# నేటి నుంచే కొత్త ఈహెచ్‌ఎస్ అమలు



**హైదరాబాద్, ఆగస్టు 22 :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి ఆధారిత కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)ను నూతన విధానాలతో శనివారం నుంచి అధికారికంగా అమల్లోకి తీసుకువచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లు మెరుగైన వైద్య సేవలను నగదు రహిత పద్ధతిలో పొందే అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రూపొందించిన ఈ కొత్త పథకం ఆరోగ్య రంగంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. తెలంగాణ సచివాలయంలో ట్రస్ట్ బోర్డు కన్వీనర్, ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి టీజీ–జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌తో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం ట్రస్టు బోర్డు సభ్యులు హాజరయ్యారు. తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అపోలో, కాంటినెంటల్, యశోద, కిమ్స్ వంటి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొని పథకం అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్‌తో పాటు కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు కొత్త ఈహెచ్‌ఎస్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఏకగ్రీవంగా అంగీకరించాయి. ఈ నిర్ణయంతో అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబ సభ్యులకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపానెల్ చేసిన ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య చికిత్సల కోసం ముందుగా భారీ మొత్తాలు చెల్లించి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ఈ పథకం ఉపశమనం కలిగించనుంది. కొత్త ఈహెచ్‌ఎస్ మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఆసుపత్రుల ఎంపానెల్‌మెంట్ విధానం, చికిత్స ప్రోటోకాల్స్, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ, రోగుల సేవలకు సంబంధించిన నూతన నిబంధనలను ఇందులో స్పష్టంగా పేర్కొన్నారు. చికిత్స పొందే ప్రతి లబ్ధిదారునికి సకాలంలో సేవలు అందేలా, క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతంగా జరిగేలా వ్యవస్థను మరింత పారదర్శకంగా రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కొత్త పథకానికి కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి లభించిన సహకారంపై ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రుల యాజమాన్యాలు ముందుకు రావడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి లబ్ధిదారుడికి సమర్థవంతమైన వైద్య సేవలు అందిం చడంలో ఈహెచ్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. కొత్త ఈహెచ్‌ఎస్ పథకాన్ని అక్షరాలా అమలు చేసి లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో సేవలు అందించాలని ఎంపానెల్ చేసిన అన్ని ఆసుపత్రులకు ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. ఆరోగ్య సేవల విషయంలో ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ విధానాల్లో ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ కొత్త ఈహెచ్‌ఎస్ పథకం లక్షలాది కుటుంబాలకు మరింత భరోసా కల్పించనుంది.






# ఎయిడ్స్ అవగాహనకు బైక్ ర్యాలీ

**ఆదిలాబాద్, ఆగస్టు 22 :**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్--2026'లో భాగంగా శనివారం ఆదిలాబాద్ పట్టణంలో భారీ బైక్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆధారిత అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై ప్రతిజ్ఞ చేసి ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. వ్యాధి నివారణలో సమాచారం, అవగాహన కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు, వైద్య సిబ్బంది మరియు యువత పట్టణంలోని ప్రధాన ప్రాంతాల గుండా ప్రయాణిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్ తదితర ప్రాంతాల మీదుగా సాగిన ర్యాలీ తిరిగి ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగిస్తూ జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు చేశారు. ఎయిడ్స్ నియంత్రణలో ముందస్తు అవగాహన, సకాలంలో పరీక్షలు, వైద్య సలహాలు ఎంతో ముఖ్యమని వైద్య అధికారులు తెలిపారు. యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలి, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందించేందుకు ఇటువంటి ప్రచార కార్యక్రమాలు ఉపయోగపడతాయని వివరించారు.



# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

**సిద్దిపేట, ఆగస్టు 22 :**

సిద్దిపేట జిల్లా నర్మెటలోని ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని మాజీ మంత్రులు హరీశ్ రావు, వి. ప్రశాంత్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ కార్యకలాపాలు, ఉత్పత్తి సామర్థ్యం, రైతులకు అందిస్తున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. అనంతరం మాట్లాడిన హరీశ్ రావు, ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు లాభదాయ కమైన పంటగా నిలుస్తోందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో స్థిరమైన ఆదాయం అందించే ఈ పంటను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం జలాల అందుబాటుతో సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్‌ఫామ్ సాగుకు నాంది పలికిన విషయాన్ని హరీశ్ రావు గుర్తు చేశారు. సాగునీటి సౌక ర్యాలు పెరగడంతో రైతులు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతుల ఆదాయంలో గణనీయ మైన పెరుగుదల నమోదవు తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌ఫామ్ విస్తరణకు గతంలో తీసుకున్న చర్యలు ఇప్పుడు ఫలితాల రూపంలో కనిపిస్తున్నాయని అన్నారు. నర్మెట ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ అనతికాలంలోనే 60 వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ పూర్తి చేయడం గొప్ప విజయ మని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. ఇది ఫ్యాక్టరీ సామ ర్థ్యానికి, రైతుల సహకారా నికి నిదర్శనమని చెప్పారు. ̄



# కాల్వ ప్రజ్ఞ మృతికి ఈటల సంతాపం

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

రాష్ట్ర బీజేపీ కార్యాలయ కార్యదర్శి కాల్వ ఉమాశంకర్ కుమార్తె కాల్వ ప్రజ్ఞ ఆకస్మిక మరణం పట్ల ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజ్ఞ మృతి బాధాకరమని పేర్కొంటూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శనివారం అంబర్‌పేట స్మశానవాటికలో నిర్వహించిన అంత్యక్రియలకు ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజ్ఞ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల దుఃఖంలో తాను భాగస్వామినని తెలిపారు. అనంతరం కాల్వ ఉమాశంకర్‌ను పరామర్శించిన ఈటల రాజేందర్, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజ్ఞ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఎంపీ, ఇలాంటి క్లిష్ట సమయంలో పార్టీ శ్రేణులు అండగా ఉండాలని సూచించారు. ప్రజ్ఞ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుం బ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రజ్ఞ మృతి వార్త బీజేపీ శ్రేణులను తీవ్ర విషాదంలో ముంచిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. అంత్యక్రియలకు పలువురు బీజేపీ నాయకు లు, కార్యకర్తలు, కుటుంబ మిత్రులు హాజరై నివాళులర్పించారు.

# సైబరాబాద్‌లో దైవిక సేకరణ కార్యక్రమం

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'దైవిక సేకరణ కార్యక్రమం'ను విజయవంతంగా నిర్వహించారు. నగర పరిధిలోని 17 దేవాల యాల్లో ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తుల నుంచి ఉపయోగించిన పూజా సామగ్రిని స్వీకరించారు. పండుగలు, పూజల అనంతరం మత ̆పరమైన వస్తువులను బహిరంగ ప్రదే శాలు, చెరువులు, నీటి వనరుల్లో వేయ కుండా శాస్త్రీయంగా నిర్వహిం చేందు కు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. దేవాలయాలకు వచ్చిన భక్తులు పూజలు, ప్రత్యేక ఆరాధ నలు నిర్వహించిన అనంతరం ఉపయోగించిన పూజా వస్తువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రాల్లో అప్పగించారు. దీంతో పరిసర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, నీటి వనరులు కలుషితం కావడం వంటి సమస్యలను నివారిం చేందుకు అవకా శం ఏర్పడింది. సైబ రాబాద్ మున్సిపల్ కమిషనర్ చిట్టా రమ్మ దేవాలయాన్ని సందర్శించి ఏర్పా ట్లను పరిశీలించారు. కూకట్‌పల్లి జోన్ కమిషనర్, అదనపు కమిషనర్‌తో కలి సి పూజా కార్యక్ర మంలో పాల్గొని భక్తు లకు అందుబా టులో ఉంచిన సౌక ర్యాలను సమీక్షించా రు. సేకరణ ప్రక్రి య సక్రమంగా జరుగుతున్న తీరును పరిశీలించి అధికా రులకు అవసరమైన సూచనలు చేశారు. సేకరించిన పూజా సామగ్రిని కార్పొరే షన్ బృందాలు శాస్త్రీయ పద్ధతిలో వేరు చేసి నిర్వహిస్తున్నాయి.





# సోదరభావంతో మిలాద్-ఉన్-నబీ జరుపుకోవాలి

**సిద్దిపేట, ఆగస్టు 22 :**

మిలాద్-ఉన్-నబీ పండుగను శాంతియుత, ప్రశాంత వాతావరణంలో సోదరభావంతో జరుపుకోవాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ రష్మి పెరుమాళ్ పిలుపుని చ్చా రు. శనివారం సిద్దిపేట ఏసీపీ కార్యాల యం లో స్థానిక ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతిని ధులు, శాంతి కమిటీ సభ్యులతో ప్రత్యే క సమన్వయ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా పండుగ నిర్వహణ కు సంబం ధించిన ఏర్పాట్లు, భద్రతా చర్య లు, ఊరేగిం పుల మార్గాలు, ప్రజల భాగ స్వామ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చిం చారు. సమాజం లో శాంతి, సామర స్య వాతా వరణాన్ని కాపా డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీపీ పేర్కొన్నారు. మిలా ద్-ఉన్-నబీ ప్రవక్త మహ మ్మద్ బోధించిన ప్రేమ, కరుణ, మానవ తా విలువలను గుర్తు చేసే పవిత్ర సందర్భమని అన్నారు. ఈ పండుగ ను పరస్పర గౌరవంతో, మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అపోహలు, వదంతు లను నమ్మ కుండా ప్రజలు బాధ్యతా యుతం గా వ్యవహరించాలని కోరారు. పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగిం పులు, ప్రార్థనా కార్యక్రమాలు, ఇతర వేడుక లు నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం జరగా లని తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగ కుండా నిర్వాహకులు పోలీసులతో సమ న్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్య లు తీసుకో వాలని అధికారులను ఆదేశిం చారు. సామా జిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలను ఎవరూ ప్రోత్సహిం చవద్దని హెచ్చరించారు. మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలను పోలీసులు ఉపేక్షించరని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్య లు తలెత్తినా వెంటనే పోలీసు అధికారుల దృష్టికి తీసుకు రావాలని మత పెద్దలకు సూచించారు. స మావేశంలో పాల్గొన్న ముస్లిం మత పెద్ద లు, శాంతి కమిటీ సభ్యులు ప్రతి సంవ త్స రం మాదిరిగానే ఈసారి కూడా పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తి సహ కారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.



# అన్నయ్యే నా హీరో.. చిరంజీవిపై పవన్ కళ్యాణ్ ఎమోషనల్ పోస్ట్

హైదరాబాద్, ఆగస్టు 22 :

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన అన్నయ్య చిరంజీవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగంతో కూడిన సందేశాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. చిన్ననాటి నుంచి చిరంజీవి తనకు కేవలం అన్నయ్య మాత్రమే కాదని.. ఎప్పటికీ తన హీరోనే అని పవన్ పేర్కొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న పవన్

చిరంజీవి కళాశాల చదువుల కోసం నర్సాపూర్ వెళ్లిన రోజులను పవన్ గుర్తు చేసుకున్నారు. వేసవి సెలవుల్లో ఆయన ఇంటికి వచ్చినప్పుడు తమ కుటుంబానికి అది పండగలా ఉండేదని తెలిపారు. తిరిగి చదువుల కోసం వెళ్లిపోయినప్పుడు ఇంట్లో ఒక వెలితి కనిపించేదని భావోద్వేగంగా చెప్పారు. చిరంజీవి హీరో కాకముందే తన దృష్టిలో హీరో అని పేర్కొంటూ.. పొడవాటి జుట్టు, బెల్‌బాటమ్ ప్యాంట్, కళ్లద్దాలతో తండ్రి బుల్లెట్ బైక్‌పై కనిపించే అన్నయ్యను చూసిన జ్ఞాపకాలను పంచుకున్నారు. అన్నయ్య ఇచ్చిన బహుమతుల జ్ఞాపకం చిరంజీవి తన కెరీర్ తొలినాళ్లలో సింగపూర్ పర్యటనకు వెళ్లి వచ్చిన సందర్భంగా తమ కోసం తెచ్చిన బహుమతులను కూడా పవన్ గుర్తు చేసుకున్నారు. పెద్ద నీలిరంగు బ్యాగ్‌లో తన కోసం తీసుకొచ్చిన చిన్న లెగో హెలికాప్టర్, రిమోట్ కార్లు, రేసింగ్ ట్రాక్, కామిక్స్, మ్యూజిక్ టేపులు, టేప్ రికార్డర్, పెర్ఫ్యూమ్‌లు వంటి బహుమతులు తన చిన్ననాటి జ్ఞాపకాల్లో ప్రత్యేకంగా నిలిచిపోయాయని తెలిపారు. చిరంజీవి ఎప్పుడూ తమ ఇంటికి ఆనందాన్ని, చిరునవ్వులను తీసుకొచ్చేవారని పేర్కొన్నారు.

# స్పిరిట్ వివాదంపై దీపికా పదుకొనే రియాక్షన్!

హైదరాబాద్, ఆగస్టు 22 :

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'స్పిరిట్' నుంచి హీరోయిన్ దీపికా పదుకొనే తప్పుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ వివాదంపై దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సోదరుడు, నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. పారితోషికం.. లాభాల్లో వాటా! ఓ ఇంటర్వ్యూలో ప్రణయ్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దీపికా పదుకొనే పారితోషికంతో పాటు సినిమాలో 10 శాతం లాభాల వాటాను కూడా అడిగారని తెలిపారు. దీంతో సినిమా బడ్జెట్ లెక్కలు కుదరక ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని వెల్లడించారు. అంతేకాకుండా షూటింగ్ సమయాలకు సంబం ధించి ఆమె కొన్ని షరతులు పెట్టారని, ఈ కారణంగానే విభేదా లు తలెత్తాయని పేర్కొన్నారు. జర్నలిస్ట్ పోస్ట్‌కు దీపిక లైక్ ఈ వ్యాఖ్యలపై ఓ జర్నలిస్ట్ స్పందిస్తూ.. మహిళా నటీనటులు లాభా ల్లో వాటా అడిగితేనే ఎందుకు విమర్శలు చేస్తారని ప్రశ్నించారు. ఎంతో మంది హీరోలు ఏళ్లుగా ఇదే విధానాన్ని అనుస రిస్తున్నారని పేర్కొంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ చేశారు.





# హోటల్ వివాదంపై మాధురి రాథోడ్ ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 22 :

మాధురిపై దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు ఐఫోన్ చోరీ, వీడియోలు తీశారంటూ ఆరోపణలు సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై చర్యలు కోరిన ఆర్టిస్ట్వే ములవాడలో ఫోక్ సాంగ్ ఆర్టిస్టులు ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్‌లకు సంబంధించిన వ్యక్తిగత వ్యవహారం వివాదంగా మారింది. ఈ ఘటన నేపథ్యంలో మాధురి రాథోడ్ వేములవాడ పోలీసులను ఆశ్రయించారు. తనపై దాడి చేయడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించారని ఈశ్వర్ సాయి భార్య శరణ్యపై ఆమె ఫిర్యాదు చేశారు. తనపై దాడి చేయడమే కాకుండా అక్కడి దృశ్యాలను వీడియో తీశారని, తన ఐఫోన్‌ను కూడా తీసుకెళ్లారని మాధురి ఆరోపించారు. అలాగే సోషల్ మీడియా వేదికల్లో తన వ్యక్తిగత జీవితంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఆమె ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టారు.




# జైలర్ 2 నుంచి హుషారైన పాట.. రజనీ స్టైలిష్ ఎంట్రీ!

హైదరాబాద్, ఆగస్టు 22 :

సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ చిత్రం 'జైలర్ 2'. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. 'కావాలయ్యా' సెంటిమెంట్‌తో.. 'జైలర్' తొలి భాగంలో తమన్నాపై తెరకెక్కిన 'కావాలయ్యా' పాట దేశవ్యాప్తంగా ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో 'జైలర్ 2' నుంచి 'అలా బోలేలో' అంటూ సాగే హుషారైన ప్రత్యేక గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. పాటకు సంబంధించిన సాహిత్య వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. పూర్ణ అదిరిపోయే స్టెప్పులుఈ ప్రత్యేక గీతంలో నటి పూర్ణ అదిరిపోయే స్టెప్పులతో అలరించారు. ట్రెండీ బీట్స్‌తో సాగిన ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ స్వయంగా గానం చేయడంతో పాటు సంగీతం అందించారు. తెలుగు వెర్షన్‌కు శ్రీనివాస మౌళి సాహిత్యం అందించగా.. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. రజనీ స్టైలిష్ ఎంట్రీపాట మధ్యలో రజనీకాంత్ స్టైలిష్ ఎంట్రీ ఇవ్వడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, గ్రేస్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. పాట విడుదలైన వెంటనే సామాజిక మాధ్య మాల్లో మంచి స్పందన లభిస్తోంది. ఇక 'జైలర్ 2' చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



# గాయం అయినా షూటింగ్ ఆపలేదు.. లోకేష్ కనగరాజ్ డెడికేషన్‌కు ఫిదా!

హైదరాబాద్, ఆగస్టు 22 :

దర్శకుడిగా కోలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్.. నటుడిగానూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. 'డీసీ' చిత్రంలో విలక్షణమైన, పవర్‌ఫుల్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అయితే తెరపై కనిపించిన ఆ కొన్ని నిమిషాల నటన వెనుక ఆయన పడిన కష్టం, ఎదుర్కొన్న సవాళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పాత్ర కోసం శారీర కంగా భారీ కసరత్తుఈ సినిమాలోని పాత్ర కోసం లోకేష్ కనగరాజ్ తన శరీరాకృతిని పూర్తిగా మార్చు కోవాల్సి వచ్చిం ది. కఠినమైన డైట్ పాటిం చడంతో పాటు ముఖ్యంగా లోయర్ బాడీ వర్కవుట్స్ చేస్తూ తీవ్రంగా శ్రమించారు. ఇందుకు సంబంధించిన మేకింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో.. ఆయన డెడికేషన్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నా రు. యాక్షన్ సీన్‌లో తీవ్ర గాయం సినిమా షూటింగ్ సమయంలో యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా లోకేష్‌కు ఊహించని ప్రమాదం జరిగింది. తీవ్రమైన స్టంట్స్ చేసే క్రమంలో ఆయన భుజం డిస్‌లోకేషన్‌కు గురైంది. దీంతో తీవ్ర నొప్పితో బాధపడ్డారు.

# న్యూస్ యాంకర్ నుంచి హీరోయిన్‌గా..

**రవితేజ 'ఇరుముడి'తో బిగ్ బ్రేక్‌పై ప్రియా భవానీ శంకర్ ఆశలు**

హైదరాబాద్, ఆగస్టు 22 :

మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఇరుముడి' చిత్రంలో తమిళ నటి ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఈ సినిమాతో తెలుగులో ఘన విజయం సాధించి టాలీవుడ్‌లో బిగ్ బ్రేక్ అందుకోవాలని ఆశిస్తున్నారు. న్యూస్ యాంకర్‌గా కెరీర్ ప్రారంభం ప్రియా భవానీ శంకర్ సినీ ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా సాగింది. ఆమె తొలుత తమిళ టీవీ ఛానెల్‌లో న్యూస్ యాంకర్‌గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రముఖ టెలివిజన్ సీరియళ్లలో నటించి బుల్లితెర ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. బుల్లితెరపై వచ్చిన క్రేజ్‌తో 2017లో నటుడు వైభవ్ సరసన 'మేయాద మాన్' అనే తమిళ చిత్రం ద్వారా కథానాయికగా వెండితెరకు పరిచయమయ్యారు.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467